బ్యాంకుల చుట్టూ తిరగాల్సిందే..

అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల పంపిణీపై ఆంక్షలు ఈ నెల కూడా కొనసాగనున్నాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాక పింఛన్లను వలంటీర్ల సాయంతో ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకల్లా ఇంటింటికీ వెళ్లి అందించేవారు. సార్వత్రిక ఎన్నికలను కారణంగా చూపించి వలంటీర్ సేవల్ని నిలిపేశారు. దీంతో మూడు నెలలుగా లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పట్లేదు.

- ఈ నెలా పింఛన్‌దారులకు తప్పని తిప్పలు
- చంద్రబాబు నిర్వాకంపై అవ్వాతాతల ఆగ్రహం
- వచ్చేది జగన్ ప్రభుత్వమే.. మా కష్టాలకు ముగింపు–లబ్ధిదారులు


సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీపై సూచనలిస్తున్న ఎంపీడీవో తదితరులు

నక్కపల్లి: పింఛన్ కష్టాలు కొనసాగుతున్నాయి. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తే లబ్ధిదారులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటేస్తారన్న అక్కసుతో చంద్రబాబు తన బినామీల ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించి, వలంటీర్ల సేవల్ని అడ్డుకున్నారు. దీంతో ఏప్రిల్, మే నెలల పింఛన్లు అవ్వాతాతలకు ఒకటో తేదీన అందలేదు. ఏప్రిల్లో సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. మే నెల్లో బ్యాంకుల వద్ద, మండుటెండల్లో క్యూ కట్టారు. జూన్ పింఛన్లకు కూడా అవే తిప్పలు పడాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుందని, తమ కష్టాలు తీరతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఓటింగ్ ముగిసినా..

ఓటింగ్ ముగియడంతో జూన్ నెల పింఛన్లయినా ఇంటికి తెచ్చి ఇస్తారనుకుంటే కోడ్ అమల్లో ఉందన్న కారణంగా ఈ నెల పింఛన్లు కూడా బ్యాంకుల్లోనే జమ చేస్తున్నారు. ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. రోహిణి కార్తె ప్రవేశంతో భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఉదయం 8 దాటితే కాలు బయటపెట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యం అవ్వాతాతలు, దివ్యాంగులు బ్యాంకుల వద్దకు వెళ్లి, గంటల తరబడి క్యూలో నిరీక్షించి, డబ్బులు తెచ్చుకోవడం చాలా కష్టసాధ్యం. చంద్రబాబు కారణంగానే తమకీ గతి పట్టిందని ఆక్షేపిస్తున్నారు.

మండలంలో పింఛన్లు 12,339

నక్కపల్లి మండలంలో మొత్తం 12,339 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.3.53 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నారు. చంద్రబాబు ఫిర్యాదు కారణంగా గడచిన రెండు నెలల నుంచి 9,112 మంది లబ్ధిదారులకు రూ.2.73 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇక మంచానికే పరిమితమైన వారు, దివ్యాంగులు, నడవలేని పరిస్థితిలో ఉన్న రోగులు తదితర లబ్ధిదారులు 3,227 మందికి రూ.79.48 లక్షల నగదును సచివాలయ సిబ్బంది ఇంటికే వెళ్లి అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

శుక్రవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజులు జూన్ 1వ తేదీన బట్వాడా చేసే పింఛన్లకు సంబందించి సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఒకటో తేదీ ఉదయం నుంచే ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల నగదును అందించాలని సూచించారు. బ్యాంకులకు వెళ్లి పింఛన్లు డ్రా చేసుకునే వారికి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకు వినియోగంతో అనర్థాలు


పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అచ్యుతాపురం: ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు కల్యాణి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాస్, రామలక్ష్మి, సునీత, ఉమామహేశ్, గణేశ్, శాంతి, ఇందిర, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలను పెంచాలి


సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: సచివాలయాల్లో ఆన్‌లైన్ సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండలంలోని కైలాసపట్నం, పందూరు గ్రామ సచివాలయాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఆన్‌లైన్ సేవల వివరాలు తెలుసుకుని, వీలైనంత ఎక్కువగా నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల హాజరు నమోదు తప్పనిసరన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పొగాకు వాడకం హానికరం


చౌడువాడ పీహెచ్‌సీలో పొగాకు నష్టాలను వివరిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు

కె.కోటపాడు: పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య పరిస్థితులను ప్రజలు గుర్తించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వల్ల వ్యాప్తి చెందే అనారోగ్య సమస్యలపై ప్రజలకు ఆయన వివరించారు. పొగాకు వల్ల క్యాన్సర్‌తో పాటు పక్షవాతం, అంధత్వం, తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారినపడతారన్నారు. స్టాఫ్ నర్స్ ధనలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఉమ, ల్యాబ్ టెక్నీషియన్ మాధురి, ఏఎన్‌ఎం సన్యాసమ్మ పాల్గొన్నారు.

359 మందికి వైద్య సేవలు


కె.జె.పురం హైస్కూలులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

మాడుగుల రూరల్: కె.జె.పురం హైస్కూలు ఆవరణలో ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 352 మంది సాధారణ రోగులు వైద్య సేవలు పొందారు. ఏడుగురు కంటి రోగులను ఆప్తాలమిక్ అసిస్టెంట్ పి. నాగలక్ష్మి పరీక్షించారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సంతోష్‌కుమార్, నరేష్‌లతోపాటు కె.జె.పురం ప్రధాన వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు, కె.లీలాప్రసాదు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ పుష్పమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లలిత, ఏఎన్‌ఎంలు అచ్యుతాంబ, సత్యతోపాటు ఆశ కార్యకర్తలు కళావతి, లక్ష్మి, విజయ, వరహాలమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు ఆటలు పోటీలతోపాటు కథలు, బుక్ రీడింగ్ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం ఆట పాటలతో పుస్తకాలు చదివించారు. బాలలతో కథలు చెప్పిస్తూ వారికి ఏయే కళల పట్ల మక్కువ ఉందో తెలుసుకుని తర్ఫీదు ఇస్తున్నారు. ఈ నెల 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథపాలకురాలు వరహామణి తెలిపారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోత్సాహం


పదిలో మెరిట్ సాధించిన విద్యార్థులతో తోటాడ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్

మునగపాక: చదువులో ఏకాగ్రత చూపడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సాధ్యమని తోటాడ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్ తెలిపారు. పదిలో మంచి ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థుల ఇంటర్ చదువుకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోత్సాహం అందించింది. ఈ మేరకు శుక్రవారం సంబంధిత విద్యార్థులు లావేటి హాసిని, ఆడారి వేణుశ్రీ, యల్లపు శ్యామలను ఆయన అభినందించారు. వీరికి భీమిలి బీచ్‌రోడ్డులోని తిమ్మాపురం దరి విజ్ఞాన్ వరల్డ్ వన్ విద్యా సంస్థలో రెండేళ్ల పాటు ఇంటర్ చదువుకు అవసరమైన మొత్తాన్ని ఫౌండేషన్ అందిస్తుందన్నారు. ఇందుకు రెడ్డీస్ ఫౌండేషన్ ఒక్కో విద్యార్థి రూ.2.86 లక్షల మేర ఫీజులు, ఇతర వసతులకు సాయం అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు.

'ఉపాధి' బడ్జెట్ పెంచాలి

అచ్యుతాపురం: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్‌ను పెంచి కూలీలకు మౌలిక సదుపాయాలకు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రెపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అచ్యుతాపురం మండలంలోని పెదపాడులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించి, రోజు కూలి పెంపుతోపాటు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు కర్రి అప్పారావు, ఆర్.రాము, శ్రీనివాసరావు, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

ఉపాధి హామీ పథకానికి కేంద్రం తూట్లు


కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం మునగపాకలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ముందుగా కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 200 రోజుల పని దినాలతోపాటు, పనిచేసే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పించాలన్నారు. కూలీల సమస్యల పరిష్కారానికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత ఎస్.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

నాతవరం కళాశాలలో చేరాలంటూ ప్రచారం

నాతవరం: స్థానిక హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తామని హెచ్‌ఎం ఎస్.శాంతికుమారి తెలిపారు. నాతవరం హైస్కూల్‌ను ప్రభుత్వం ఇటీవల కళాశాలగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. పదో తగరతి పాసైన విద్యార్థులంతా చేరాలంటూ శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక వాహనంలో మండల వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందాలన్నారు. కాలేజీ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు హైస్కూల్ భవనంలోనే సమకూర్చామన్నారు. డి.యర్రవరం, గునుపూడి, తాండవ, చమ్మచింత, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, నాతవరం హైస్కూళ్లలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఇతర వివరాలకు నాతవరం హైస్కూల్‌ను సంప్రదించాలన్నారు.


కారులో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ


న్యాయమూర్తి సూర్యకళ


హాజరైన పోలీసు సిబ్బంది

చోడవరం రూరల్: వచ్చే నెలలో 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అపరిష్కృత కేసులకు ఇరు వర్గాల సమ్మతితో పరిష్కారం చూపాలని చోడవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు వర్గాలతో ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక కోర్టుల పరిధిలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా అటు కక్షిదారులు ఇటు కోర్టు, పోలీసు, న్యాయవాద వర్గాల విలువైన కాలం వృథా అవుతున్నందున ఆయా కేసులను గుర్తించాలని సూచించారు. వాటిలో ఇరువర్గాల కక్షిదారులను సమీకరించి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరింపబడే కేసులకు వర్తించే ప్రయోజనాలను వివరించాలన్నారు. కోర్టులో ఎప్పటికో లభించే తీర్పు వల్ల కలిగే ఉపశమనం కన్నా లోక్ అదాలత్ తీర్పునకు అదనపు లబ్ధిని వారికి వివరించి సంబంధిత కేసులను పరిష్కరించాలని సూచించారు. దీని కోసం తమ తమ పరిధిలో కేసులను ముందుగా గుర్తించి సంబంధిత కక్షిదారులతో సంప్రదింపులు చేసి అధిక సంఖ్యలో విముక్తి కలిగించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు క్లర్క్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

కె.కోటపాడు: అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం చౌడువాడ హైస్కూల్ హెచ్‌ఎం ఈర్లె అప్పారావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమంలో అప్పారావు సేవలను ప్రశంసించారు.

44 ఏళ్ల పాటు ఎంతో మంది విద్యార్థుల ఉన్నతకి కృషి చేశారన్నారు. అనంతరం అప్పారావు మాస్టారును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీ రాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, రిటైర్డ్ ఎంఈవో దాట్ల చంద్రశేఖర్ వర్మ, కింతాడ, కొత్తపెంట సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, నీలిమా వెంకటరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆకుల సాయిప్రసాద్, మాజీ సర్పంచ్ బొయిదాపు జగదీశ్వరరావు, దాట్ల రవిబాబు, బొడ్డు దేముడుబాబు, వంటాకు గోవిందరావు, వంటాకు రాముినాయుడు తదితరులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.


అప్పారావును సన్మానిస్తున్న శివాజీరాజు, తదితరులు

కార్డన్ సెర్చ్‌లో 25 వాహనాల సీజ్


కోటవురట్లలో కార్డన్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలతో పోలీసు అధికారులు


కోటవురట్ల సంతబయలు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోటవురట్ల: ఓట్ల లెక్కింపు ప్రక్రియ దగ్గరపడుతున్న కొద్దీ భద్రతా చర్యలు పెరుగుతున్నాయి. ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఎస్పీ పి.మురళీకృష్ణ ఆదేశాలతో మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 5 గంటల నుంచి 8 గంటల వరకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. సంతబయలు, రెల్లివీధుల్లో ఇంటింటిని జల్లెడ పట్టి 150 వాహనాలను గుర్తించారు. వాటిలో 80 వాహనాలకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాల్లేని 24 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రికార్డులు చూపించి, వాహనాలను తిరిగి పొందవచ్చన్నారు. తనిఖీల్లో సీఐలు అప్పన్నబాబు, అప్పలరాజు, విజయ్‌కుమార్, ఎస్ఐలు రమణయ్య, విభీషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా గుణాన్ని అలవరచుకోవాలి

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు సేవా గుణాన్ని అలవరచుకోవాలని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి కొణతాల రత్నకుమారి సూచించారు. మండలంలోని మూలపేటలో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదవడం అంటే నాకిష్టం కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్ని వృథా చేయకుండా శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. సత్యం పలకడం, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం, రోగులకు సేవలందించడంతోపాటు, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. చదువులో ఏకాగ్రత ఉంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఏవీఎన్ మూర్తి, భీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు, ఆడారి జగ్గప్పారావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి రత్నకుమారి

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవు


ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు మద్యం తాగి వాహనం నడిపితే ఆరు నెలల జైలు శిక్షతోపాటు, రూ.10 వేల అపరాధ రుసుం వసూలు చేస్తారన్నారు. జూన్ నుంచి కొత్త చట్టం అమలులోకి వస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్లలో కూడా సురక్షితంగా ప్రయాణించాలంటే తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం నేరమన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

లే అవుట్లపై దృష్టి సారించాలి

పాయకరావుపేట: మండలంలోని గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లపై గ్రామ కార్యదర్శులు దృష్టి సారించాలని ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో గల పీఎల్ పురం, అరట్లకోట, శ్రీరాంపురం, సీతారాంపురం, పెదరాంభద్రపురం, పాల్మన్‌పేట, పాయకరావుపేట తదితర గ్రామాల పరిధిలో వేస్తున్న లేఅవుట్‌లు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉల్లంఘనల్ని సహించేది లేదని హెచ్చరించారు.

గోరుముద్ద.. మరింత నాణ్యత, రుచికరం

- ఎండీఎం నిర్వాహకులకు అవగాహన
- మెనూ ప్రకారం వండించి రుచి చూసిన అధికారులు


మెనూ ప్రకారం నిర్వాహకులు సిద్ధం చేసిన ఆహార పదార్థాలు


నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో నరేష్

నక్కపల్లి: మరో పది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని మరింత నాణ్యతగా, రుచికరంగా పిల్లలకు అందించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులతో ఎంఈవో కుంచం నరేష్, జగనన్న గోరుముద్ద పథకం పర్యవేక్షకుడు శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి గోరుముద్ద పథకాన్ని మరింత నాణ్యతగా, పోషక విలువలతో కూడి రుచికరంగా ఉండేలా మెనూలో మరిన్ని పదార్థాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మెనూ తయారీలో ఎలాంటి రాజీ లేదన్నారు. మెనూ మేరకు పదార్థాలు తయారు చేయాల్సిందేనన్నారు. తమ ఇంట్లో కంటే పాఠశాలల్లోనే రుచికరమైన పౌష్టికాహారం అందుతోందన్న అనుభూతి విద్యార్థుల్లో కలగాలన్నారు. మెనూ పదార్థాల తయారీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జగనన్న గోరుముద్దను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు తయారు చేసిన పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం కూడ ముఖ్యమన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఉపాధ్యాయులు వేమగిరి నూకరాజు, మూర్తిరాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా ఉండాలని ఎంఈవో మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన నిర్వాహకులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలన్నారు. ఐఎఫ్‌పీ ద్వారా మెనూను ప్రదర్శించారు. గ్యాస్‌స్టవ్‌పై పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. అధికారులు వాటిని రుచి చూశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శేషుకుమార్ పాల్గొన్నారు.

మెనూ పదార్థాలు

సోమవారం	హాట్ పొంగల్/ వెజిటబుల్ రైస్, ఎగ్ కర్రీ
మంగళవారం	పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించినగుడ్డు
బుధవారం	వెజిటబుల్ రైస్, ఆలూ కుర్మా, చిక్కీ, ఉడికించిన గుడ్డు
గురువారం	సాంబార్ రైస్/పులిహోర, టమాటా చట్నీ, ఉడికించినగుడ్డు
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం	ఆకుకూర రైస్, స్వీట్ పొంగల్

ఏలేరు కాలువలో నాచు, గడ్డి తొలగింపు


పొక్లెయిన్ సాయంతో నాచు, గడ్డి తొలగింపు

మాకవరపాలెం: ఏలేరు కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని వజ్రగడ, దాలింపేట, కొండలఅగ్రహారం, పైడిపాల, లచ్చన్నపాలెం, మాకవరపాలెం, తామరం, రాచపల్లి, రామన్నపాలెం, శెట్టిపాలెం గ్రామాల సమీపంలో ఏలేరు కాలువ ఉంది. ఈ కాలువలో గట్లకు ఇరువైపులా జంగిల్‌తోపాటు గుర్రపుడెక్క, నాచు, గడ్డి అధికంగా పేరుకుపోయాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. నీటి సరఫరా లక్ష్యం కూడా చేరకపోవడాన్ని గుర్తించిన అధికారులు ప్రస్తుతం కొండలఅగ్రహారం వద్ద వాటిని తొలగించే పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే విశాఖ ప్రజలకు తాగునీరు, స్టీల్ ప్లాంట్ అవసరాలకు ఆశించిన స్థాయిలో నీరు అందుతుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.